క్లుప్తంగా

సమాజ హితమే లక్ష్యం



ప్రమాణం చేస్తున్న జేసీఐ నూతన కమిటీ

తిరుపతి కల్చరల్‌ : సమాజ హితమే లక్ష్యంగా జేసీఐ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు జూనియర్‌ చాంబర్‌ ఇంటర్నేషనల్‌ అధ్యక్షుడు శేషసాయి తెలిపారు. శనివారం ఓ ప్రైవేట్‌ హోటల్‌లో జేసీఐ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జేసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, జోనల్‌ అధ్యక్షుడు భరత్‌కుమార్‌, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నూతన కమిటీ సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. జేసీఐ కార్యదర్శి వి.దిలీప్‌కుమార్‌, కోశాధికారి దిలీప్‌రెడ్డి, జోనల్‌ ప్రతినిధులు జీఎల్‌ మనోహర్‌, ప్రమోద్‌కుమార్‌, కృష్ణమూర్తి, భాస్కర్‌ పాల్గొన్నారు.

యంగ్‌ అచీవర్స్‌ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న నీలేష్‌కుమార్‌

తిరుపతి కల్చరల్‌ : చెన్నై ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ వారు తిరుపతికి చెందిన నీలేష్‌కుమార్‌కు యంగ్‌ అచీవర్స్‌ అవార్డు ప్రదానం చేశారు. శనివారం ఈ మేరకు వర్సిటీలోని టీపీ గణేష్‌ ఆడిటోరియంలో చేపట్టిన కార్యక్రమంలో అవార్డు అందించి సత్కరించారు.

'పరిచయ వేదిక'కు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్‌ : బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక ఆహ్వాన పత్రికను వేదిక కన్వీనర్లు వెంకటపెరుమాళ్‌, వేదం హరిప్రసాద్‌ ఆవిష్కరించారు. శనివారం ఈ మేరకు ప్రెస్‌ క్లబ్‌లో వారు మాట్లాడుతూ 2025 ఫిబ్రవరి 16వ తేదీన బైరాగిపట్టెడలోని వైఖానస కల్యాణ మండపంలో పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా 62 ఏళ్లు నిండిన దంపతులకు షష్ఠి పూర్తి, 70 ఏళ్లు దాటిన వృద్ధ దంపతులకు భీమరథ శాంతి జరిపించనున్నట్లు వివరించారు. పాల్గొనదలచిన వారు జనవరి 30వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9030177388, 9949339851 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో భీమాస్‌ అశోక్‌ , రామశర్మ, మహేష్‌, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోష్‌ యాక్ట్‌పై అవగాహన

తిరుపతి సిటీ : మహిళా యూనివర్సిటీ పీఎం ఉష, మహిళా అధ్యయన కేంద్రం, ఐసీడీఎస్‌, ఉమెన్‌ సేఫ్టీ సెంటర్‌ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు పోష్‌ యాక్ట్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రామ్‌ కో–ఆర్డినేటర్‌ డాక్టర్‌ డి.ఉమాదేవి మాట్లాడుతూ లైంగిక వేధింపుల చట్టం ఆవశ్యకతను వివరించారు. సైబర్‌క్రైమ్స్‌, గుడ్‌టచ్‌–బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌ సీతా కుమారి, సి.వాణి, నోడల్‌ ఆఫీసర్‌ వాసంతి, షబ్రీం, సుజాత, సుచరిత, రాణి, మాధవి, మాధురి పరదేశి, సునీత పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యపై నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

తిరుపతి కల్చరల్‌ : తిరుమల బైపాస్‌ రోడ్డులోని కొర్లగుంట జంక్షన్‌ నుంచి మార్కెట్‌ రోడ్డు వరకు తలెత్తిన డ్రైనేజీ సమస్యపై సీపీఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం నిరసన తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తున్నా కార్పొరేషన్‌ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

ఆత్మహత్యాయత్నంపై విచారణకు డిమాండ్‌

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఇంజినీరింగ్‌ కళాశాల హాస్టల్‌ భవనంపై నుంచి దూకి అరవింద్‌రెడ్డి అనే విద్యార్థి ఆత్మహత్యకు యత్నించిన ఘటనపై విచారణ జరిపించాలని బీజేవైఎం నేత కల్లూరు విష్ణువర్ధన్‌ రెడ్డి డిమాండ్‌ చేశారు. శనివారం ఈ మేరకు రిజిస్ట్రార్‌ భూపతినాయుడుకు వినతిపత్రం అందించారు. ప్రవీణ్‌ కుమార్‌రెడ్డి, మధుసూదన్‌, ప్రసన్న కుమార్‌రెడ్డి, అంజినాయక్‌ పాల్గొన్నారు.



వైఎస్‌ జగన్‌ పుట్టినరోజు వేడుకలో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి



పులిబోనుపల్లెలో చీరలు పంపిణీ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



పాళ్యంలో కేక్‌ కట్‌ చేస్తున్న పిల్లలు

జగమంత సంబరం

అభిమానం ఉప్పొంగింది.. ఆనందం అవధులు దాటింది.. ఆత్మీయత వెల్లివిరిసింది.. అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును వైఎస్సార్‌సీపీ కుటుంబం వేడుకగా జరుపుకుంది.. వాడవాడలా సేవా కార్యక్రమాలు చేపట్టింది.. ఊరూరా అన్నదానం చేసింది.. బడుగులకు దుస్తులు పంపిణీ చేసింది.. వందలా ప్రాణాలకు భరోసా కల్పిస్తూ రక్తదాన శిబిరాలు నిర్వహించింది.. రోగులకు పండ్లు పంచిపెట్టింది.. జననేత అమలు చేసిన సంక్షేమ పథకాలను అందరికీ గుర్తుచేసింది.. పోరాట స్ఫూర్తితో ముందడుగు వేయాలని సంకల్పించింది.. పేదల ప్రభుత్వ స్థాపనే లక్ష్యంగా సాగుతామని ప్రతినబూనింది.

- ఘనంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌ జన్మదినోత్సవం
- పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించిన నేతలు, కార్యకర్తలు



భూమనకు కేక్‌ తినిపిస్తున్న మాజీ మంత్రి ఆర్‌కే రోజా, పక్కన ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి

తిరుపతి మంగళం: పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అందించిన జగనన్న ఐదేళ్ల పాలన స్వర్ణయుగమని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. శనివారం తిరుమల బైపాస్‌రోడ్డులోని ఓ కల్యాణమండపంలో పార్టీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భూమన కరుణాకర రెడ్డి, మాజీ మంత్రి ఆర్‌కే రోజా, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్‌ శిరీష, భూమన అభినయ్‌రెడ్డి, వంగపండు ఉష ఆధ్వర్యంలో కేక్‌ కట్‌ చేసి పంచిపెట్టారు. అనంతరం వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ జగనన్న స్థాపించిన పార్టీలో కార్యకర్తగా పనిచేయడం మన అదృష్టమన్నారు. ఆరు నెలల కూటమి ప్రభుత్వంతో ఇప్పటికే ప్రజలు విసిగిపోయి ఉన్నారని, రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీకే మళ్లీ పట్టం కట్టనున్నార వెల్లడించారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ తిరుపతిని అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్‌గా భూమన అభినయ్‌రెడ్డి విశేషంగా అభివృద్ధి చేశారన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌తోనే అభినయ్‌ ఓడిపోయారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో ఆయన లక్ష ఓట్ల మెజారిటీతో గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు. అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ తరతరాలు చెప్పుకునేలా తిరుపతిని జగనన్న పాలనలో అభివృద్ధి చేశామని చెప్పారు. గత ఎన్నికల్లో సాంకేతికంగా ఓడామే కానీ.. నైతికంగా గెలిచామన్నారు. మేయర్‌ డాక్టర్‌ శిరీష మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పేదలు సంతోషంగా జీవించారని తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్‌ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ వైఎస్‌. జగన్‌ మోహన్‌రెడ్డి ప్రతి పేద వాడి గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్‌ చైర్మన్‌ కేతం జయచంద్రారెడ్డి, పార్టీ నేతలు ఎస్‌కె. బాబు, పందలూరి పెంచులయ్య, మల్లం రవిచంద్రారెడ్డి, బొమ్మగుంట రవి పాల్గొన్నారు.

పాకాల : ఆర్టీసీ బస్‌స్టాండ్‌ వద్ద జగనన్న పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్‌, వైఎస్సార్‌ విగ్రహాలకు తుడా మాజీ చైర్మన్‌ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారీ కేక్‌ను కట్‌ చేసి పార్టీ శ్రేణులకు పంచి పెట్టారు. అలాగే అన్నదానం చేశారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడే గొప్ప నేత జగనన్న అని కొనియాడారు.

రామచంద్రాపురం : మండలంలోని అనుప్పల్లి పంచాయతీ నెమళ్లగుంటపల్లి, నెత్తకుప్పం నిర్వహించిన జగనన్న పుట్టినరోజు వేడుకల్లో వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే తిమ్మరాజుపల్లి, పీవీపురం, సొరకాయలపాలెంలో జగనన్న జన్మదినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులు మురగయ్య, గణపతిరెడ్డి, హిమాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ మునీంద్రయాదవ్‌, నాయకులు సిద్ధారెడ్డి, నాదముని, చంద్రబాబు, నిరంజన్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి సిటీ : ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద జగనన్న జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేత హరిప్రసాద్‌ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో కిషోర్‌దాస్‌, హేమంత్‌కుమార్‌రెడ్డి, పోతు మురళీధర్‌, వెంకటరమణారెడ్డి, శివక్రిష్ణయాదవ్‌, సతీష్‌, నరేష్‌, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. అలాగే వర్సిటీలోని ప్రకాశం భవన్‌ వద్ద జగనన్న పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎస్వీయూ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌ ప్రజా సంక్షేమ పథకాల సారథిగా జగనన్న ప్రజల గుండెల్లో నిలిచిపోయారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కొండా యుగంధర్‌, ముని, హరి, రాజా, లిఖిత్‌, బోస్‌సాయి, మధు, వెంగళరావు, గోకుల్‌, వంశీ, సుధీర్‌, పవన్‌ పాల్గొన్నారు.

తిరుపతి కల్చరల్‌ : తిరుపతిలోని రెడ్డి రెడ్డి కాలనీలో ఎమ్మెల్సీ డాక్టర్‌ సిపాయి సుబ్రమణ్యం కేక్‌ కట్‌ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో డాక్టర్‌ బాబు, డాక్టర్‌ రమణ, రోజా, డాక్టర్‌ నీలావతి, నిర్మల, మహేష్‌, రాజశేఖర్‌ పాల్గొన్నారు.

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలో జగనన్న పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికేక్‌ కట్‌ చేసి పంచిపెట్టారు. చినిగేపల్లె కట్టమీద గంగమ్మ గుడిలో డీసీఎంఎస్‌ మాజీ చైర్మన్‌ సహదేవరెడ్డి, సర్పంచ్‌ సింహాల విమల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాళ్యం గ్రామంలో పిల్లలు, పెద్దలు కలసి కేక్‌ కట్‌ చేసి ఇంటింటికీ పంచిపెట్టారు. ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు స్వరూప పాల్గొన్నారు.

ఎర్రావారిపాళెం మండలంలో..

ఉదయమాణిక్యంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కేక్‌ కట్‌ చేసి పంచిపెట్టారు. పులిబోనుపల్లెలో చీరలు, జాకెట్లు, గాజులు, పూలు, పండ్లు పంపిణీ చేశారు. నేతలు చెంగల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కరుణాకర్‌ రెడ్డి పాల్గొన్నారు.

చంద్రగిరి : మండలంలోని ప్రతి పంచాయతీలో జగనన్న జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. చంద్రగిరి క్లాక్‌ టవర్‌ వద్ద చెవిరెడ్డి మోహిత్‌ రెడ్డి ముందుగా మహానేత వైఎస్‌ఆర్‌ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. కేక్‌ కట్‌ చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

తిరుపతి రూరల్‌ మండలంలో...

తిరుపతి రూరల్‌ మండలం లింగేశ్వరనగర్‌ లో భారీ కేక్‌ కట్‌ చేశారు. పేదలకు అన్నదానం నిర్వహించారు. తిరుమల నగర్‌ పంచాయతీలో ఘనంగా వేడుకలు చేపట్టారు. సి.గొల్లపల్లి గ్రామంలో వైస్‌ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. దుర్గసముద్రం పంచాయతీ పరిధిలోని అక్షయ క్షేత్రంలో వైసీపీ యువజన విభాగం నాయకులు పండ్లు, బ్రెడ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. చెవిరెడ్డి మోహిత్‌ రెడ్డి కేక్‌ కట్‌ చేసి పంచిపెట్టారు.

చిన్నగొట్టిగల్లు మండలంలో...

చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లె పంచాయతీ పాళెం గ్రామంలో ఘనంగా జగనన్న జన్మదినోత్సవం జరుపుకున్నారు. కేక్‌ కట్‌ చేసి అందరికీ పంపిణీ చేశారు.



రామచంద్రాపురంలో పార్టీ శ్రేణులతో కలిసి కేక్‌ కట్‌ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌ రెడ్డి



ఎస్వీయూలోని ప్రకాశం భవన్‌ వద్ద కేక్‌ కట్‌ చేస్తున్న విద్యార్థులు



జగన్‌ జన్మదినోత్సవంలో కేక్‌ కట్‌ చేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం



సి.గొల్లపల్లెలో యువతతో కలిసి కేక్‌ కట్‌ చేస్తున్న వైస్‌ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి

ఘనంగా గణితశాస్త్ర దినోత్సవం





పాకాల : రామానుజన్‌కు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్‌, తిరుపతిలో చార్ట్‌లు ప్రదర్శిస్తున్న పిల్లలు

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా జాతీయ గణితశాస్త్ర దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్‌ మొహిద్దీన్‌బాషా మాట్లాడుతూ గణిత శాస్త్ర అభివృద్ధికి శ్రీనివాస రామానుజన్‌ కృషి అమూల్యమని, ఆయన జయంతిని పురస్కరించుకుని మ్యాథమాటిక్స్‌ డే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం రామానుజన్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపల్‌ రమేష్‌కుమార్‌, మాధవి, కోఆర్డినేటర్‌ ఈశ్వర్‌ బాబు, పాల్గొన్నారు.

తిరుపతి కల్చరల్‌ : వీక్ష ది స్కూల్‌లో శనివారం జాతీయ మ్యాథమేటిక్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు ప్రదర్శించిన చార్ట్‌లు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్‌ డాక్టర్‌ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పిల్లలు గణితంపై పట్టు సాధించి బాల మేధావులుగా రాణించాలని కోరారు. డాక్టర్‌ వెంకటేశ్వర్లు, అమిటి యూనివర్సిటీ డిప్యూటీ మేనేజర్‌ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ నేటి తరం పిల్లలు శ్రీనివాస రామానుజన్‌, శకుంతల దేవి, ఆర్యభట్ట, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సర్వేపల్లి రాధాకృష్ణన్‌ వంటి మహోన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.



తిరుపతి : బహుమతులు అందుకున్న విద్యార్థులు

అలాగే వరదరాజనగర్‌ శ్రీపురం కాలనీలోని భాష్యం పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలు,ఎగ్జిబిషన్‌ చేపట్టారు. ముఖ్య అతిథిగా దిశా పోలీస్‌ స్టేషన్‌ సీఐ మహ్మమద్‌ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్‌ బాలాజీ మాట్లాడుతూ గణితం పట్ల మక్కువ పెంచుకుని రాణించాలని కోరారు. భాష్యం జోనల్‌ ఇన్‌చార్జి లక్ష్మణ్‌ లిటిల్‌ చాంప్స్‌ ఇన్‌చార్జి సుధాకుమారి పాల్గొన్నారు.

బ్యాంకింగ్‌ సేవలపై అవగాహన



మాట్లాడుతున్న మేనేజర్‌ పాపయ్య

చంద్రగిరి : మండలంలోని కొటాల గ్రామంలో శనివారం చంద్రగిరి కెనరా బ్యాంకు మేనేజర్‌ జక్కా పాపయ్య బ్యాంకింగ్‌ సేవలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణులకు సేవలందించడంలో కెనరా బ్యాంకు ముందుంటుందని వెల్లడించారు. 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వరకు ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా ప్రారంభించుకోవాలని సూచించారు. తమ బ్యాంకు ద్వారా వ్యవసాయ, బంగారు రుణాలతోపాటు ఆక్వా, డెయిరీ, పౌల్ట్రీకి సైతం రుణాలు మంజూరు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ మేనేజర్‌ లోహిత్‌ రెడ్డి, ధనలక్ష్మి, నందకుమార్‌ రెడ్డి, సుబ్రమణ్యం , నాగార్జున, వెంకటాద్రి పాల్గొన్నారు.

ధ్యానం.. జీవన యోగం





మాట్లాడుతున్న కంచి రఘురామ్‌, ధ్యానం చేస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో ధ్యానంపై శిక్షణ శిబిరం నిర్వహించారు. శనివారం ఈ మేరకు వీసీ జీఎస్‌ఆర్‌ కృష్ణమూర్తి మాట్లాడుతూ ధ్యానం అంటే ఆరోగ్య, ఆనంద జీవన యోగమని వెల్లడించారు. కార్యక్రమంలో జానకిరామ్‌, డాక్టర్‌ లక్ష్మీనారాయణ, డాక్టర్‌ బలిచక్రవర్తి, జ్ఞానరంజన్‌, శివకుమార్‌, లోకేశ్వర్‌, రాహుల్‌ కుమార్‌ పాల్గొన్నారు. అలాగే ఎస్వీయూ కేంద్రీయ గ్రంథాలయం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ప్రొఫెసర్‌ కొంగర సురేంద్ర బాబు మాట్లాడుతూ ధ్యానంతో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు.

తిరుపతి కల్చరల్‌ : తిరుపతి స్పిరిచ్యువల్‌ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం అన్నమాచార్య కళామందిరంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కంచి రఘురామ్‌, డిప్యూటీ డీఈఓ బాలాజీ, టీటీడీ పురాణ ఇతిహాస ప్రాజెక్టు ప్రత్యేకాధికారి విభీషణ శర్మ , రిటైర్డ్‌ ఎస్పీ స్వామి, అరబిందో సొసైటీ సభ్యులు, ప్రపంచ జ్ఞాన దినోత్సవం ప్రాజెక్టు చైర్మన్‌ జయరామిరెడ్డి, సభ్యులు సుబ్రమణ్యం, డి.ప్రవీణ్‌కుమార్‌, సేతు వాహిని, ప్రసాద్‌రాజు, డాక్టర్‌ ప్రసన్న, పిరమిడ్‌ రమేష్‌, సంజీవరాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'సదస్సు'

పాకాల : రైతుల భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్‌ నిత్యానందబాబు తెలిపారు. శనివారం మండలంలోని మద్దినాయనపల్లెలో సర్పంచ్‌ గిరిధర్‌రెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రాజేంద్రప్రసాద్‌, ఏఓ పుష్పావతి పాల్గొన్నారు.